ఒకచోట వృథా.. మరో చోట వ్యథ





- తాగునీటికి ఇబ్బంది పడుతున్న ప్రజలు
- కొన్ని ప్రాంతాల్లో సరిపడినంత నీరు లేక అవస్థలు
- మరి కొన్ని ప్రాంతాల్లో తాగునీరు వృథా చేస్తున్న స్థానికులు



తాటిచెట్లపాలెంలో చిన్న ధారతో అరకొర నీటి సరఫరా

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42, 45 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో భిన్నమైన వాతావరణం కనిపిస్తుంది. కొన్ని ప్రాంతాల్లో నీటి కోసం అష్టకష్టాలు పడుతుంటే, మరికొన్ని ప్రాంతాల్లో నీటిని వృథాగా వదిలేస్తున్నారు. అసలే ఎండాకాలం.. చుక్కనీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడే కాలం. అయినా కొందరు మాత్రం ఏ మాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తూ, నీటిని వృథా చేస్తున్నారు. ప్రత్యేకించి 45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో చాలా చోట్ల నీరు వృథాగా పోతోంది. గతంలో ఈ ప్రాంతంలో తాగునీటికి ఎన్నో ఇబ్బందులు పడేవారు. కానీ ఇంటింటికీ కుళాయిలు వచ్చిన దగ్గర నుండి కొందరికి నీటిని ఎలా వాడాలో కూడా తెలియక ప్రతిరోజు రోడ్లు కడిగేయడం, **అనవసరంగా** నీటిని పట్టి **వదిలేయడం** వంటివి చేస్తు**న్నారు**. నీటిని తాగేందుకు, ఇతర **అవసరాల**కు వాడుకోవడంలో **తప్పులేదు.** ఎంత మేర వాడాలో అంత **వాడడం మంచిదే** కానీ అదే పనిగా తాగాల్సిన, అవసరాలకు వినియోగించాల్సిన నీటితో ప్రతిరోజు రోడ్లు కూడా కడిగేస్తున్నారు కొందరు. ఇలా చేయడం వల్ల నడిచే రోడ్లు సైతం నాచుపట్టి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నా కానీ కొందరు మాత్రం మారడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న నీటి కుళాయిలకు సరైన హెడ్ (కంట్రోల్స్) లేక నీరు వృథాగా పోతుంది. మరికొన్ని చోట్ల చిన్న చిన్న రిపేర్లకు నోచుకోక తాగేనీరు వృథాగా పోతుంది. సంబంధిత సిబ్బందికి తెలియజేసినా కూడా స్పందించడం లేదని స్థానికులు తెలియజేస్తున్నారు.



వరాహగిరి కాలనీలో వృథాగా పోతున్న మంచినీరు

మరో పక్క ప్రారంభమైన నీటి వెతలు..

జీవీఎంసీ 42, 55 వార్డుల పరిధిలో గల తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ వంటి పలు ప్రాంతాల్లో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేవలం 10 నిమిషాల నుండి అరగంట వరకు మాత్రమే మంచినీరు (కుళాయి నీరు) వస్తుంది. అది కూడా చిన్నధారతో వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఈ నీరు ఎంతమాత్రం సరిపోవడం లేదని, ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే రోజుల్లో మరింత ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని కాలనీల వాసులు తెలియజేస్తున్నారు. కనీసం నిత్యావసరాలకు కూడా ఈ నీరు సరిపోవడం లేదంటున్నారు. ఇప్పటి నుండే సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకుని, నీటి విడుదల సమయాన్ని పెంచాలని, నీటి ప్రవాహం (ఫోర్స్) కూడా పెరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



తాటిచెట్లపాలెంలో నీటి కోసం బిందెల క్యూ

నీటికి ఇబ్బందులు పడుతున్నాం..

తాటిచెట్లపాలెంలో నీటికి ఇబ్బందులు పడుతున్నాం. ప్రతిరోజు కనీసం అరగంటైనా నీరు రావడం లేదు. అదీ చాలా తక్కువ ధార రావడంతో కనీస అవసరాలకు కూడా నీరు సరిపోవడం లేదు. తాగునీటి కోసం ఇప్పుడే ఇలా ఇబ్బందులు పడాల్సి వస్తే ఎండలు పెరిగితే పరిస్థితి ఏమిటి? అధికారులు స్పందించి ధార పెరిగేలా చూడాలి. కనీసం గంట సేపైనా నీరు విడుదల చేయాలి.
– కె. శ్రీనివాస్, తాటిచెట్లపాలెం

కుళాయిలు ఎక్కువ సేపు రావడం లేదు..

రైల్వేన్యూకాలనీలో మంచినీరు సరిగా రావడం లేదు. ప్రతిరోజు నీటి కోసం వేచి ఉండాల్సి వస్తోంది. వచ్చిన కుళాయిలు ఎక్కువ సేపు ఉండడం లేదు. ఇలా రావడం, వెంటనే కట్టేయడం చేస్తున్నారు. జీవీఎంసీ కుళాయిలు చాలా తక్కువ సమయం రావడంతో నీరు సరిపోవడం లేదు. రానున్నది ఎండాకాలం. అప్పుడు ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే భయంగా ఉంటుంది.
– రమాదేవి, రైల్వేన్యూకాలనీ

నీటిని వృథా చేస్తున్నారు..

కొండవాలు ప్రాంతాలైన సత్యసాయినగర్, వరాహగిరి కాలనీల్లో తాగునీటిని కొందరు వృథా చేస్తున్నారు. గతంలో ఇక్కడ నీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. ఇష్టానుసారంగా నీటిని రోడ్డుపై వదిలేయడం, రోడ్లను కడగడం చేస్తున్నారు. స్థానికుల్లో మార్పురావాలి. తాగేనీరు వృథా చేయకుండా వాడుకోవాలి. ఈ మధ్య రెండు రోజులు నీరు రాకపోతే ఎన్నో ఇబ్బందులు పడ్డాం.
– ఎస్ సత్యనారాయణ, సింహగిరికాలనీ

క్లుప్తంగా

బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ



బాలును అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ మధుకుమార్

సీతంపేట: ఆంధ్రా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో నిర్వహించిన రెండో సౌత్ ఈస్ట్ జోనల్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో బుల్లయ్య కళాశాల విద్యార్థి ప్రతిభ చూపాడు. ఇంజినీరింగ్ ఈఈఈ ఫైనల్ ఇయర్ విద్యార్థి కె.బాలు 65 కిలోల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా గురువారం బాలును కళాశాల సెక్రటరీ జి.మధుకుమార్, ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ యు.గంగాభవాని అభినందించారు.

జోన్-3లో 34 చలివేంద్రాల ఏర్పాటు



సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వద్ద జీవీఎంసీ చలివేంద్రం

సీతమ్మధార: జీవీఎంసీ జోన్–3 పరిధిలో 34 చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జోనల్ కమిషనర్ పి.శివప్రసాద్ తెలిపారు. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు ఉపశమనం పొందేలా చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు చలివేంద్రాల్లో తాగునీరు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కీలక జంక్షన్ల మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారుల సౌకర్యార్థం చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

పిచ్చుకల సంరక్షణకు చర్యలు



చెట్టుపై నీటి పాత్రలు అమర్చుతున్న కీర్తి పట్నాయక్, సత్యనాథం

మురళీనగర్: గ్లోబల్ వార్మింగ్, సెల్ టవర్స్ నుంచి వెలువడే రేడియేషన్ వల్ల అంతరించిపోతున్న పిచ్చుకల సంరక్షణకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ కీర్తి పట్నాయక్ కోరారు. పిచ్చుక జాతి పక్షుల సంరక్షణలో భాగంగా ట్రస్టు ఆధ్వర్యంలో మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్‌తో కలిసి గురువారం పిచ్చుక గూళ్లు కట్టించి వాటి దాహార్తిని తీర్చేందుకు మట్టిపాత్రలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు భానుప్రకాష్, కార్యదర్శి ప్రసాద్, సుధాకర్, గణేష్, జీవీఎంసీ పారిశుధ్య కార్మికుడు అచ్చిబాబు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 7 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది గురువారం విశాఖ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా బెంగళూరుకు చెందిన ప్రవీణ్‌కుమార్, శశాంక్, ఒడిషా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన అశ్విని ప్రధాన్ విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా ఆయా ప్రాంతాలకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని, రూ.35 వేల విలువ గల 7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. తనిఖీల్లో జీఆర్పీ ఎస్‌ఐలు కె.శాంతారాం, ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐలు పి.శివనారాయణ, ఎస్.చిట్టిబాబు సిబ్బంది పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.16.45 లక్షలు

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల సంపత్ వినాయగర్ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 21 రోజులకు గాను రూ.16.45 లక్షల నగదు, 2.977 మిల్లీ గ్రాముల బంగారం, 0.098 మిల్లీ గ్రాముల వెండి, పలు దేశాలకు చెందిన డాలర్లు, ఒమన్ రియాల్ 40, మలేసియా రింగ్గిట్ 1, కతర్ రియాల్ 1, ఒక చెక్కు లభించాయని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవస్థానం సిబ్బంది హుండీ ఆదాయం లెక్కించారు.

'నమో భారతాంబ' పుస్తకావిష్కరణ

సీతంపేట: పరవస్తు పద్య పీఠం ఆధ్వర్యంలో భారతదేశ వాయుసేన మాజీ ఉద్యోగి, ప్రస్తుత బ్యాంకు ఉద్యోగి నాగుల శ్రీనివాసరావు రచించిన నమో భారతాంబ పద్య కావ్య ఖండం ఆవిష్కరణ సభ గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథి గురు సహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్ పుస్తకావిష్కరణ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాయుసేనలో, బ్యాంకులో పనిచేసిన అనుభవం ఉన్న నాగుల శ్రీనివాసరావు తెలుగు భాషపై ఉన్న మక్కువతో సుమారు 200 సీస పద్యాలతో పుస్తకాన్ని రచించడం అభినందనీయమన్నారు. దేశభక్తి, దైవభక్తి ప్రతిబింబేలా ఉన్న ఈ పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. రచయిత నాగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది మహనీయులు ప్రాణాలర్పించారని, వారు అసలైన హీరోలని, వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నేటి తరం పిల్లల్లో దేశభక్తి, దైవభక్తి స్ఫురించేలా తన రచన దోహదపడుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ డి.వి.సూర్యారావు పుస్తక సమీక్ష చేశారు. సిహెచ్.చిన సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో పరవస్తు ఫణిశయన సూరి, స్టేట్ బ్యాంక్ ఏజీఎం కుష్బు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆచంట సుష్మ, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కడిమెళ్ల వరప్రసాద్, సాహితీవేత్తలు

విద్యార్థి మయూఖ్‌కు హోం మంత్రి ప్రశంస

బీచ్‌రోడ్డు: ద్వారకానగర్ బీవీకే కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ చదువుతున్న భాగవతుల ఆరుద్ర మయూఖ్‌ను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రశంసించారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరిగిన 'మహిళల రక్షణకు కలిసికట్టుగా' అనే కార్యక్రమంలో 'నిశ్శబ్దం హింసను ప్రేరేపిస్తుందా' అనే అంశంపై ఆరుద్ర మయూఖ్ ప్రసంగించాడు. ప్రస్తుత సమాజంలో యువత తీరును ఎండగడుతూ, సమకాలీన అంశాలతో చరిత్రను అనుసంధానం చేసి ప్రసంగించిన తీరు సభికులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమం ముగిశాక తిరిగి వెళ్తున్న సందర్భంలో మయూఖ్‌ను హోం మంత్రి ప్రత్యేకంగా పిలిచి అభినందించారు. మీలాంటి యువత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆమె ఆకాంక్షించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి కూడా మయూఖ్‌ను అభినందించారు. తనకు ఈ అవకాశాన్ని కల్పించిన ఆరిలోవ పోలీస్ స్టేషన్ సీఐ మల్లేశ్వరరావుకు, కళాశాల ప్రిన్సిపాల్ పి.రత్నశేఖర్‌కు మయూఖ్ కృతజ్ఞతలు తెలిపాడు.



ఆరుద్ర మయూఖ్‌ను అభినందిస్తున్న హోం మంత్రి అనిత

కేజీహెచ్ పిల్లల వార్డుకు వైద్య పరికరాల అందజేత

మహారాణిపేట: కేజీహెచ్ పిల్లల విభాగానికి ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్, బజాజ్ ఎలాక్ట్రానిక్స్ సంయుక్తంగా సుమారు రూ. 4 లక్షల విలువైన వైద్య పరికరాలు గురువారం సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ద్వారా అందజేశాయి. ఈ సందర్భంగా ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ తరఫున ఆంధ్రా మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థి, ప్రముఖ నియోనిటాలజిస్ట్ డాక్టర్ సతీష్ మాట్లాడుతూ ఈ పరికరాలు నవజాత శిశువులకు, వెంటిలేటర్ అవసరమైన శిశువులకు ఎంతో సహాయకారిగా ఉంటాయన్నారు. ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ కార్యదర్శి నటాషా కేజీహెచ్ పిల్లల విభాగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ పరికరాలు అందజేశారన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏడాదిలో ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ పిల్లల విభాగానికి రూ. 9 లక్షల విలువైన పరికరాలు అందజేశారని తెలిపారు. ఈ పరికరాలు ఎంతో విలువైనవి అన్నారు. ఈ పరికరాల ద్వారా ఎన్నో శిశు మరణాలు నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ కార్యదర్శి నటాషాకు, డాక్టర్ సత్యవాణికి, బజాజ్ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులకు, డాక్టర్ సతీష్ కుమార్‌కు పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్ హెచ్‌వోడీ డాక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రొఫెసర్ డాక్టర్ రత్నకుమారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యకుమారి, ఇతర వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ శివానంద్‌కు వైద్య పరికరాలు అందజేస్తున్న ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్, బజాజ్ ఎలాక్ట్రానిక్స్ ప్రతినిధులు

సిరులతల్లికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 0608100 11006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్, యూటీఎఫ్ ప్రతినిధులు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి యూటీఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెరిగేలా యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను గురువారం తన చాంబర్‌లో యూటీఎఫ్ నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి, వారి బంగారు భవితకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ స్కూళ్లు బలోపేతమైతేనే అందరికీ మేలు జరుగుతుందన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ప్రధానమైనదన్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పెరిగేలా ప్రతీ ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్, కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శులు రియాజ్ అహ్మద్, టి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

మనమిత్ర యాప్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సచివాలయ కార్యదర్శులు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు గౌరీవీధి సచివాలయం ఆధ్వర్యంలో మనమిత్ర యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ మేరకు సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు జయచంద్ర యాదవ్, పీవీ కిరణ్ కుమార్ యాదవ్ మొబైల్ ఫోన్లలో 9552300009 వాట్సాప్ నంబర్ సేవ్ చేసుకోవాలని, తద్వారా హాయ్ అనే మెసేజ్ పంపటం ద్వారా సేవలు పొందవచ్చని వివరించారు. శక్తి యాప్ ద్వారా మహిళలకు రక్షణ లభిస్తుందన్నారు.

మే నాటికి ఆర్‌వోబీ పనులు పూర్తి చేయాలి

విశాఖ సిటీ : రైల్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌వోబీ) పనులు ఎట్టి పరిస్థితుల్లోను మే నెలాఖరు నాటికి పూర్తి చేసి బ్రిడ్జ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఆయన గురువారం పలు ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా సెంట్రల్ నర్సరీలో సుమారు రూ.93 లక్షల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ఎన్ఏడీ ఫ్లై ఓవర్ వద్ద నిర్మిస్తున్న ఆర్‌వోబీ పనులను ఇంజినీర్లు, గుత్తేదారు ప్రతినిధిని అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ మధుసూదనరావు, డీఎఫ్‌వో సుజాతా శివానీ, సహాయక ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, గుత్తేదారు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆర్‌వోబీ పనులు పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

జీవీఎంసీ కార్మికుల సమస్యలపై ధర్నా

సీతమ్మధార: జీవీఎంసీలో 30 ఏళ్లు పని చేసి రిటైరైన కాంట్రాక్ట్ కార్మికులు (ఆప్కాస్), అకాల మరణం పొందిన కార్మికులు, అనారోగ్యం పాలై వైద్యం పొందుతున్న కార్మికుల కుటుంబాల బిడ్డలకు తక్షణం ఉపాధి కల్పించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఆశీలమెట్ట జోన్–3 కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లు దాటినవారు, చనిపోయినవారు, అనారోగ్యం పాలైన కార్మికుల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీచేయడం లేదన్నారు. 2023 ఆగస్టులో నాటి కమిషనర్ రాతపూర్వకంగా మినిట్స్ రూపంలో కార్మికుల బిడ్డలకు ఉపాధి కల్పిస్తామని చేసిన ఒప్పందాన్ని తుంగలో తొక్కారన్నారు. కార్మికులకు పనిముట్లు, సేఫ్టీ పరికరాలు ఇవ్వకుండా వారి డబ్బులతోనే చీపుర్లు వంటివి కొనిపించడం జీవీఎంసీకే అవమానకరమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆప్కాస్ పెట్టి అందులో మున్సిపల్ కార్మికులను చేర్పించిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేసి కాంట్రాక్టర్ల వ్యవస్థను తెస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. తక్షణమే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జోన్–3 కమిటీ కార్యదర్శి జె.ఆర్.నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, హెల్త్ అలవెన్స్ బకాయిలు చెల్లించాలని, జీవీఎంసీలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న అన్ని విభాగాల కార్మికులను పర్మినెంట్ చేయాలని, క్లాప్ డ్రైవర్లు, బదిలీ కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.కుమారి, పి.వెంకటరావు, ఆర్.శ్రీనివాస్, ఇ.ఆదినారాయణ, కొండమ్మ, విజయ, రాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఆశీలమెట్ట జోన్-3 కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పేద విద్యార్థుల ప్రోత్సాహమే లక్ష్యం

కంచరపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బలహీన వర్గాల విద్యార్థులను ప్రోత్సహించడమే డబ్ల్యూఎస్‌ఎస్ కేర్స్ ఫౌండేషన్ లక్ష్యమని సంస్థ విశాఖ, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యక్షుడు ఆర్‌ఎల్ నారాయణ తెలిపారు. గురువారం కంచరపాలెం పరిధిలోని జీవీఎంసీ రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం మినీ సైన్స్ ల్యాబ్‌కు అవసరమైన పరికరాలను ఫౌండేషన్ అందజేసింది. ఈ సందర్భంగా ఆర్‌ఎల్ నారాయణ మాట్లాడుతూ, తమ సంస్థ దేశవ్యాప్తంగా చేపడుతున్న సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించిందని వెల్లడించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ఉన్నత విద్యను అభ్యసించాలని, అందుకు అవసరమైన ప్రాథమిక విద్యను అందించడమే తమ సంస్థ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. దీనిలో భాగంగానే అవసరమైన మౌలిక వసతులను అందిస్తున్నామని తెలిపారు. కంప్యూటర్ టీచర్లు, లైబ్రరీ పుస్తకాలు, మినీ సైన్స్ ల్యాబ్‌లు, టీచింగ్ సిబ్బందిని కూడా తమ సంస్థ ద్వారా అందించే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ శ్రీనివాసరావు, పాఠశాల కంప్యూటర్ టీచర్ మరియు కో–ఆర్డినేటర్ సిహెచ్ పల్లవి, సంస్థ ప్రతినిధులు తిరుమలేష్, కులకర్ణి, సిహెచ్ నీలిమ, నాగరాజు నారాయణస్వామి, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మినీ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డబ్ల్యూఎస్‌ఎస్ కేర్స్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు నారాయణ